క్లుప్తంగా

నేడు బస్టాండ్ గేటు వేలం

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో బస్టాండ్ గేటు, కూరగాయల దిన మార్కెట్ రుసుము వసూలు చేసుకునే హక్కు కల్పించేందుకు గురువారం వేలం నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉదయం 11 గంటలకు ఈ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

నిరుద్యోగుల సదస్సు జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : కడప యూటీఎఫ్ భవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరుద్యోగుల సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సత్యనారాయణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ తెలిపారు. ప్రొద్దుటూరులో సదస్సు కరపత్రాలను బుధవారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు అనేక రకాలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్, శేఖర్ పాల్గొన్నారు.

నాటు సారా నిర్మూలనపై గ్రామ సభ

మైదుకూరు : నాటు సారా నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ బుధవారం మండలంలోని ముదిరెడ్డిపల్లె సుగాలి తాండాలో గ్రామ సభ నిర్వహించారు. అసిస్టెంట్ ఎక్సైజ్ ప్రొహిబిషన్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామ సభలో సారా వల్ల కలిగే అనర్థాలపై కళాజాత బృందంతో అవగాహన కల్పించారు. గ్రామ సభలో మైదుకూరు అర్బన్ సీఐ హాసం, తహసీల్దార్ రాజసింహా నరేంద్ర, ఎక్సైజ్ సీఐ ధీరజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక డీఎస్పీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా రోటరీక్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో డీఎస్పీ పి.భావనను బుధవారం ఘనంగా సత్కరించారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఉషారాణి మాట్లాడుతూ మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డీఎస్పీని కోరారు. ప్రొద్దుటూరులో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ఇన్నర్ వీల్ క్లబ్ సెక్రటరీ ప్రీతి, సభ్యులు గరిశపాటి లక్ష్మీదేవి, సరస్వతి, మణిశయన, జ్యోతి, యశస్వి, చాందినీ బేగం, శోభారాణి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బాలసూర్యారావు, సెక్రటరీ శ్రీధర్ శర్మ, అసిస్టెంట్ గవర్నర్ మల్లికార్జున, రవి పాల్గొన్నారు.

అర్హులకు భూములు పంపిణీ చేయాలి

బి.కోడూరు : మండల పరిధిలోని పోరుమామిళ్ల – బద్వేలు ప్రధాన రహదారికి ఇరువైపులా స్థానికేతరులకు అక్రమ అసైన్డ్ చేసిన ఫ్రీహోల్డ్ భూములపై తక్షణమే విచారణ చేపట్టి అర్హులకు పంపిణీ చేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు ఎస్.చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని దప్పిలమ్మ ఆలయం వద్ద నుండి ఐత్రంపేట వరకు పోరుమామిళ్ల – బద్వేలు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న అత్యంత విలువైన ఫ్రీహోల్డ్ భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా ఆన్‌లైన్‌లో స్థానికేతరుల పేరుతో ఎక్కించుకున్నారని తెలిపారు. సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ నియోజకవర్గ నాయకులు చంద్రమోహన్‌రాజు, జకరయ్య, నారాయణ, మండల నాయకులు మార్క్, ఓబుల్ రెడ్డి, హర్ష, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు పదో తరగతి కీలకం



పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

గోపవరం : విద్యార్థులకు పదో తరగతి కీలకమని, పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని బ్రాహ్మణపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హైమావతి పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి దాతలు చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికుడు అక్కిశెట్టి మనోహర్,రాచపూడి దిలీప్‌కుమార్, విద్యా కమిటీ చైర్మన్ రమణయ్య, మామిడి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చదవాల్సిన గ్రంథం మహాభారతం

బ్రహ్మంగారిమఠం : మహాభారతాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని టీటీడీ ధర్మ ప్రచార కర్త చాపాటి సుబ్బారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని గంగిరెడ్డిపల్లె రామాలయంలో టీటీడీ ధార్మిక పరిషత్ కడప ప్రోగ్రాం అసిస్టెంట్ గోపీ బాబు ఆధ్వర్యంలో మహాభారతం గురించి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అందరూ భారతంలోని లేని విషయాలు ప్రపంచంలో ఎక్కడా లేవని తెలిపారు. బాలవీరారెడ్డి, చిన్న ఓబుల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

పేదల బియ్యం.. పెద్దల భోజ్యం

పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం అక్రమార్కుల బొజ్జలు నింపుతున్నాయి. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలకు కాస్త ఆసరాగా ఉంటాయనుకుంటే పెద్దలకు కాసులు కురిపిస్తున్నాయి. అగ్గువకు అమ్ముడుపోయి పాలిష్ పేరుతో సన్నగా మారి తిరిగి ప్రజల చెంతకే చేరుతున్నాయి. ఇలా నిత్యం ఎక్కడో చోట రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాలు పట్టుబడుతుండడంతో పాటు అక్రమార్కులపై కేసులు కూడా నమోదవుతున్నాయి. అయినా ఈ వ్యాపారం మాత్రం ఆగడం లేదు. రూ.కోట్లలో టర్నోవర్ జరుగుతున్నా అధికారుల చర్యలు నామమాత్రంగా ఉన్నాయన్న విమర్శలు వస్తున్నాయి.

- పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం
- సన్నబియ్యంగా మార్చి విక్రయాలు
- రాష్ట్రాలు దాటిస్తూ రూ. కోట్లు గడిస్తున్న మాఫియా
- చోద్యం చూస్తున్న అధికారులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీ (ఫైల్)

బద్వేలు: బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో 172 చౌక దుకాణాలున్నాయి. ఈ దుకాణాల్లోని రేషన్ కార్డులకు ప్రతినెలా 1,080 టన్నుల బియ్యాన్ని పోరుమామిళ్ల, బద్వేలు గోడౌన్ల నుంచి సరఫరా చేస్తున్నారు. అయితే ఈ రేషన్ బియ్యం పూర్తిగా కార్డుదారులకు చేరడంలేదు. ఎక్కువ మంది కార్డుదారులు బియ్యాన్ని డీలర్లకే అమ్మి డబ్బులు తీసుకుంటున్నారు. డీలర్లు, లబ్ధిదారుల వద్ద నుంచి సేకరించిన బియ్యాన్ని ముందుగా ఆయా ప్రాంతాల్లోని అనువైన గోడౌన్లలో దాచి ఉంచి మిల్లులకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడ రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టించి నాణ్యమైన బియ్యంగా బహిరంగ మార్కెట్లోకి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నా రు. మరికొంత మంది వ్యాపారులు సేకరించిన బియ్యాన్ని ఏకమొత్తంగా ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. చాలా చవకగా లభించే రేషన్ బియ్యాన్ని, పాలిష్ పట్టించి బహిరంగ మార్కెట్లో మూడు రెట్లు ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. అంతేకాకుండా కొందరు మాఫియా ఏర్పడి టన్నుల కొద్ది బియ్యాన్ని క్రిష్ణపట్నం పోర్టు నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు సమాచారం.

జోరుగా బియ్యం దందా

బద్వేలు పట్టణం కేంద్రంగా సాగుతున్న బియ్యం మాఫియా ఇప్పుడు జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు పాకింది. ఇప్పుడు మైదుకూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల నుంచి బియ్యం బ్లాక్ మార్కెట్ వ్యాపారం జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఒకరి నియోజకవర్గంలో ఒకరు కాలుపెట్టకుండా వ్యాపారాన్ని పంచుకున్నారు. వీరు మిల్లులను లీజుకు తీసుకుని వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. రాత్రివేళ డీలర్ల నుంచి బియ్యాన్ని ఎంపిక చేసుకున్న మిల్లులకు తరలించి, 25, 50 కిలోలు ప్యాకింగ్ చేసి క్రిష్ణపట్నం ఓడరేవుకు తరలించి ఇతర దేశాలకు యథేచ్ఛగా ఎగుమతి చేస్తున్నారు.

నాయకుల అండదండలు

రేషన్ బియ్యం దందా కొనసాగిస్తున్న వారికి నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఏదైనా ఓ విషయానికి సంబంధించి పోలీసులు కేసు నమోదు చేస్తే మళ్లీ అలాంటి పనులు చేయడానికి నిందితులు కాస్త జంకుతారు. కానీ రేషన్ దందా విషయంలో అక్రమార్కులు ఏ మాత్రం భయపడటం లేదు. ప్రతిరోజూ జిల్లాలో ఏదో ఓ చోట రేషన్ బియ్యం పట్టుబడుతుండగా కేసులు కూడా నమోదవుతున్నాయి. అయినా నిందితుల్లో ఏ మాత్రం జంకూబొంకూ కనిపించడం లేదు. ఇందుకు నాయకులు తమ వెనుక ఉన్నారని ధైర్యం వారిలో కనిపిస్తున్నట్టు తెలుస్తోంది.

నామమాత్రంగా కేసులు

మార్చి 5న మైదుకూరుకు చెందిన 700 బస్తాల రేషన్ బియ్యాన్ని క్రిష్ణపట్నం తరలిస్తున్న లారీని గోపవరం మండల పరిధిలో విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. అలాగే మార్చి 8న జమ్మలమడుగు నుంచి 600 బస్తాల రేషన్ బియ్యంతో చెన్నైకి తీసుకెళ్తుండగా బద్వేలు సమీపంలో విజిలెన్స్, పోలీసు అధికారులు పట్టుకున్నారు. అయితే రోజూ పదుల సంఖ్యలో క్రిష్ణపట్నం ఓడరేవుకు బియ్యం లారీలు వెళ్లుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అడపాదడపా పోలీసులు కేసు నమోదు చేస్తున్నారే తప్పా.. పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

బియ్యం దందాను అరికడతాం



రేషన్ బియ్యం దందాను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ సిబ్బంది సహకారంతో అరికడతాం. ఇటీవల విజిలెన్స్ డిప్యూటీ తహసీల్దార్ 700 బస్తాల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని పట్టుకుని సీజ్ చేశారు. మూడు రోజుల కిందట పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ 600 బస్తాల బియ్యంతో నెల్లూరుకు వెళుతున్న లారీని గోపవరం సమీపంలో పట్టుకున్నారు. బియ్యం దందాను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం.

– ఉదయకుమార్ రాజు, తహసీల్దార్, బద్వేలు మండలం

ఊరెళ్తున్నారా.. మాకు చెప్పండి



ప్రొద్దుటూరు డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు క్రైం : తాళం వేసిన ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు.. ఒకటి కాదు.. రెండు కాదు వరుసగా చోరీలు జరుగుతుండటంతో ప్రొద్దుటూరు పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎక్కువగా చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ప్రొద్దుటూరు డీఎస్పీ భావన ప్రజలకు పలు సూచనలు చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం డీఎస్పీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇళ్లకు తాళం వేసి బయటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ముందుగా ఆయా స్టేషన్‌లకు సమాచారం ఇస్తే పోలీసులు ఇళ్లలో ఎల్‌హెచ్‌ఎంఎస్ నిఘా కెమెరాలను ఏర్పాటు చేస్తారన్నారు. ఈ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల చోరీలు జరగకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాల కోసం కమాండ్ కంట్రోల్ నంబర్ 9121100702కు ఫోన్ చేయాలని తెలిపారు. ఇల్లు వదలి వేరే ఊళ్లకు పోయేటప్పుడు సాధ్యమైనంత వరకు నగదు, బంగారు, వెండి ఆభరణాలను ఇళ్లలో ఉంచుకోకుండా బ్యాంక్ లాకర్లలో పెట్టాలని సూచించారు. అపార్ట్‌మెంట్లు, కమ్యూనిటీ ఎంట్రెన్స్ గేట్లలో, ఇళ్ల ముందు ఖచ్చితంగా సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు. అలాగే చురుకైన సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ పేర్కొన్నారు. విలువైన ఆభరణాలను ధరించి మహిళలు ఒంటరిగా బయటికి వెళ్లవద్దని హితవుపలికారు. ప్రొద్దుటూరులో రాత్రి, పగలు పోలీసుల గస్తీ ముమ్మరం చేశామని, ప్రజలు ధైర్యంగా ఉండాలని డీఎస్పీ తెలిపారు.

విలీనంతో విద్యకు విఘాతమే



పాఠశాలల విలీనానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కలసపాడు : జీఓ నంబర్ 117 రద్దు సవరణల పేరుతో ప్రభుత్వం చేస్తున్న ప్రయోగాలు ప్రాథమిక విద్యకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి తెలిపారు. బుధవారం ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేరుకు మాత్రం ఐదు రకాల పాఠశాలలు అని చెబుతూ మూడు రకాల స్కూళ్లు మాత్రమే ఉండేలా కార్యాచరణ ప్రారంభించడాన్ని ఖండిస్తున్నామన్నారు. 7 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలలోని 3, 4, 5 తరగతులన్నింటినీ విలీనం చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతి పాఠశాలలో 5 తరగతులు ఉండేలా చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శేఖర్‌బాబు, అదనపు కార్యదర్శి సత్యనారాయణ, వెంకటరెడ్డి, ప్రసాద్, బాల చెన్నయ్య, సీనియర్ నాయకులు కె.శ్రీనివాసులు, శివారెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

విలీనాన్ని వెంటనే నిలిపేయాలి

గోపవరం : పాఠశాలల విలీనంను వెంటనే ఆపాలని బద్వేలు మండల ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం జెడ్పీ హైస్కూల్ చిన్నకేశంపల్లె స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులందరూ సమావేశం అనంతరం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కూరాకుర వీంద్ర మాట్లాడుతూ ప్రతి పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా కొనసాగిస్తూ ప్రస్తుతం ఉన్న 1 నుండి 5వ తరగతి విధానాన్ని కొనసాగించాలని కోరారు.

ఎస్ఎంసీల తీర్మానం మేరకే విలీనం చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

మైదుకూరు : ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న మోడల్ స్కూల్స్ విషయంలో పాఠశాలల విలీనాన్ని పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ)ల తీర్మానం మేరకే చేయాలని మైదుకూరు క్లస్టర్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. బుధవారం క్లస్టర్ కేంద్రమైన స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో అసంబద్ధ విలీన ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర కౌన్సిలర్ యాపరాల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఎస్ఎంసీల తీర్మానం మేరకే పాఠశాలల విలీన ప్రక్రియ చేపట్టాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఎస్టీఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, ఎస్టీయూ ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామ్మోహన్, ఎస్టీయూ నాయకులు విజయుడు, నరసింహారాజు, సురేంద్ర నాయక్, సుమలత, మాధవిలత, లక్ష్మీదేవి, రమాదేవి పాల్గొన్నారు.

నిరసన

మోడల్ స్కూల్స్ ఏర్పాటులో అసంబద్ధ విలీన నిర్ణయంపై బుధవారం మండలంలోని నంద్యాలంపేట క్లస్టర్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణ కమిటీల తీర్మానం మేరకే పాఠశాలలను విలీనం చేయాలని ఉపాధ్యాయులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ పాలకొండయ్య, మండల అధ్యక్షుడు ఎస్.రమణయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మల్లేశ్వరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బీకే సురేష్ పాల్గొన్నారు.

సింహవాహనంపై శ్రీనివాసుడు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సింహవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

రేపు చండీ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ఘనంగా చండీ హోమం నిర్వహించనున్నారు. వేకువ జామున అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరిదేవికి విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు ప్రత్యేక అలంకరణ చేయనున్నారు. చండీ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడి ఓ ప్రకటనలో తెలిపారు.

ఇళ్లు నిర్మించుకోవాలంటే కప్పం చెల్లించాలా?

ప్రొద్దుటూరు రూరల్ : అమృతానగర్‌లో పేదల ఇళ్ల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవాలంటే అక్కడి ప్రైవేటు వ్యక్తులు, అధికార పార్టీ నాయకులు ప్రజల వద్ద నుంచి రూ.20వేల నుంచి రూ.30వేల వరకు డిమాండ్ చేస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు ఆయన బుధవారం తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ సీల్, రాజముద్ర కలిగిన బోగస్ డీఫారాలను కొందరు వ్యక్తులు తయారు చేసి అమాయక పేద ప్రజల స్థలాలను అమ్ముకుంటున్నారని తెలిపారు. మూడో విడత ఇందిరమ్మ కాలనీలో మౌలిక సదుపాయాలు లేకనే ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయన్నారు. ఈ విషయాలపై తహసీల్దార్, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం నాయకులు శేఖర్, వెంకటేష్, ప్రభాకర్, పెంచల్‌రెడ్డి, సుబ్బయ్య, హసీనా, పార్వతి, గోవిందమ్మ, ఎలేషమ్మ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

బద్వేలు అర్బన్ : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై రూపొందించిన వాల్‌పోస్టర్లను బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో డీవైఎఫ్ఐ నాయకులతో కలిసి కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు మత్తు, మాదకద్రవ్యాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, రామకృష్ణ, ప్రసాద్‌రెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయించొద్దు

ఖాజీపేట : ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఖాజీపేట సీఐ మోహన్ హెచ్చరించారు. ఖాజీపేట లోని మెడికల్ షాపుల యజమానులతో పోలీస్ స్టేషన్‌లో సీఐ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దుకాణా దారులు తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయమే లాభదాయకం

గోపవరం : ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో లాభదాయకమని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ అన్నారు. బుధవారం మండలంలోని గోపవరం, బేతాయపల్లె, బ్రాహ్మణపల్లె రైతుసేవా కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ–పంట సోషల్ ఆడిట్ కొరకు రైతుల జాబితా ప్రదర్శన చేయడంతో పాటు రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. అనంతరం బ్రాహ్మణపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాధవి, వ్యవసాయ విస్తరణాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపాలెంలో 'పొలం పిలుస్తోంది'

కలసపాడు : మండలంలోని రాజుపాలెం గ్రామంలో బుధవారం మండల వ్యవసాయాధికారి జాకీర్ షరీఫ్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ గురించి రైతులకు తెలియజేశారు. ఇప్పటి వరకు మండలంలో 4,789 మంది రైతులకు రైతు సేవా కేంద్రాల ద్వారా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేశామన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు శివ, రైతులు పాల్గొన్నారు.

తుమ్మలపల్లెలో..

బి.కోడూరు : మండలంలోని తుమ్మలపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కౌశిక పెసర పంట పొలాలను పరిశీలించి సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ సిబ్బంది బ్రహ్మానందరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలి

అట్లూరు : అర్హులైన దివ్యాంగులందరికీ ఇంటి స్థలంతో పాటు మూడు ఎకరాలు సాగు భూమి మంజూరు చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్ష, కార్యదర్శులు రమణ, ఖదిరుల్లా కోరారు. ఈ మేరకు బుధవారం బద్వేలులోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఇంటి స్థలాలు, సాగు భూములు కేటాయించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి దరఖాస్తులను అందజేయడం జరిగిందని, వాటి గురించి ఇంత వరకు పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా ఆర్డీఓ చొరవ తీసుకుని దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు మురళి, వెంకట సుబ్బయ్య, ప్రసన్న, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

సనాతన ధర్మమంటే ఆలయాలను కూల్చివేయడమేనా?

కాశినాయన : సనాతన ధర్మమంటే ఆలయాలను కూల్చివేయడమేనా అని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ ప్రశ్నించారు. బుధవారం ఆయన కాశినాయన ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు అనుమతులు లేవంటూ కూల్చివేసిన కట్టడాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ సినిమాల్లో నటించడం, రాజకీయాల్లో నటించడంతో పాటు సనాతన ధర్మం పేరుతో కొత్త నాటకం మొదలుపెట్టి ఆలయాలను కూల్చివేస్తున్నారని విమర్శించారు. కాశినాయన ఆలయంలో ప్రధాన సమస్య అటవీ సమస్యేనని, గతంలో ఎటువంటి కూల్చివేత జరగలేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల పాలనలోనే కాశినాయన ఆశ్రమంలోని పలు కట్టడాలను కూల్చివేశారన్నారు. పవన్‌కల్యాణ్ అటవీశాఖ మంత్రిగా ఉంటూ సనాతన ధర్మం, హిందూ ధర్మం అంటూ ఆలయ నిర్మాణాలను కూల్చివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎంపీడీఓ

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం (గ్రేడ్ 1–6) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం ఎంపీడీఓ సూర్యనారాయణ రెడ్డి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించి ఎన్నికను ఏకగ్రీవం చేశారు. కార్యదర్శుల సంఘం ప్రొద్దుటూరు అధ్యక్షుడుగా కె.రామకృష్ణ, ఉపాధ్యక్షుడుగా డి.మస్తాన్, మహిళా ఉపాధ్యక్షురాలుగా డి.శిరీష, కోశాధికారిగా డి.జశ్వంత్‌కుమార్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా సుహాసిని, అదనపు సెక్రటరీగా కిరణ్‌కుమార్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా సాంబశివారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులుగా భాగ్యలక్ష్మి, ఈశ్వరమ్మ, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ధనుంజయ్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం



ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, పార్టీ శ్రేణులు



బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ప్రొద్దుటూరు : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పార్టీ పనిచేస్తోందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, ఎంపీపీ శేఖర్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు, రాజుపాళెం మండల నాయకులు జీరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జీవీ సుబ్బయ్య, చింతల దానమ్మ, కుమార్‌రెడ్డి, గజ్జల కళావతి, శౌరి సుభాష్‌రెడ్డి, వైస్ సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నిరంతరం ప్రజల పక్షాన పోరాటం

చంద్రబాబు ప్రభుత్వం నిర్వాకం కారణంగా నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. కడప కలెక్టరేట్ వద్ద నిర్వహించిన యువత పోరుకు ప్రొద్దుటూరు నుంచి 150 వాహనాల్లో బుధవారం తరలి వెళ్లారు. రాచమల్లు శివప్రసాదరెడ్డి జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాచమల్లు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతోపాటు అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధి

బద్వేలు అర్బన్ : అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సంక్షేమం, సమస్యల పరిష్కారమే పరమావధిగా ముందుకు సాగుదామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఆవరణలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, బూత్ కన్వీనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, సుందర్‌రామిరెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డి, పోలిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, మల్లికార్జునరెడ్డి, కేశవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ బి.మునెయ్య, శ్రీకాంత్ రెడ్డి, శివయ్య, నాగేశ్వర్‌రావు, అనిల్, కుప్పాల శ్రీరాములు, చెన్నకృష్ణారెడ్డి, రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య, రెడ్డెయ్య, రజనీకాంత్, మల్లికార్జునరెడ్డి, హరికృష్ణారెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తాం

ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు నిలదీస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తామని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి పేర్కొన్నారు. యువత పోరు నిరసన కార్యక్రమానికి బద్వేలు నియోజకవర్గం నుండి వందకు పైగా వాహనాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని, బడ్జెట్‌లో సైతం పథకం ఊసే ఎత్తలేదని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం హామీల అమలుపై దృష్టి సారించాలని, లేనిపక్షంలో రాబోవు రోజుల్లో మరిన్ని పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

కలసపాడు : స్థానిక వైఎస్సార్ కూడలిలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు సూధా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్, చిత్తారాజశేఖర్‌రెడ్డి, ఎ.వి.భాస్కర్‌రెడ్డి, రాంబాబు, పులివీరారెడ్డి, నాగూర్‌షరీఫ్, థామస్ పాల్గొన్నారు.

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు హనుమంతరెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం దివంగత మహానేత వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మిద్దెల సర్పంచ్ వెంకటరామిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, యల్లయ్య పాల్గొన్నారు.

ప్రజల పక్షాన ఉద్యమిస్తాం

పోరుమామిళ్ల: నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతామని పంచాయతీరాజ్ శాఖ మాజీ ప్రభుత్వ సలహాదారుడు పోలిరెడ్డి నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్లలో వైఎస్సార్‌సీపీ 15 ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. నాగార్జున రెడ్డి మాట్లాడుతూ మోస పూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్నివర్గాలకు అన్యాయం చేస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చేప్పే రోజు త్వరలోనే వస్తుందని జోస్యం చెప్పారు.